రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ బాలప్ప బాడలో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి సహకారంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలప్ప బాడలో సరైన రోడ్డు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వెంటనే నిర్మాణ పనులు చేపట్టామని ఆమె చెప్పారు. రోడ్డు నిర్మాణం పూర్తైతే స్థానికులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు క్షీర సాగర్, అరవింద్, మల్లికార్జున్, సంతోష్, రాహుల్, బాబన్న పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ప్రభుత్వ కాలేజీ విద్యార్థిని ఎంపిక


తనూషాను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి

బర్కత్‌పుర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్గొండలో త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ కాలేజీ కరాటే చాంపియన్ షిప్ పోటీలకు కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తనూషా ఎంపికైంది. లాల్‌బహదూర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన హైదరాబాద్ జిల్లా అండర్ 19 జూనియర్‌కాలేజీ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో 37 కేజీల విభాగంలో తనుషా స్వర్ణ పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి తనుషాను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా చక్కటి ప్రదర్శన కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాలని ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు ప్రసాదరావు, రజనీ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.



జనగామ జిల్లా కొడకండ్ల మండలం పాకాల గ్రామ అలయ్ బలయ్ కార్యక్రమం ఈనెల 7న ఉదయం 10 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తామని నిర్వాహకులు డాక్టర్ బి. విద్యాకుమార్, వి. సోమయ్య, జీలకర్ర రవికుమార్, బొట్టుమంచి సుధాకర్, గోలి ప్రకాష్, బుర్కా చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురాలో వారు అలాయ్ బలాయ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.
(బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి)

అతిగా ఆలోచించడం వల్లే మానసిక అనారోగ్యం

● డా. హిప్నో పద్మాకమలాకర్

చిక్కడపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):మహిళలు అతిగా ఆలోచించడం వల్లే వారిలో మానసిక అనారోగ్యానికి కారణమవుతుందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. హిప్నో పద్మాకమలాకర్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని డా. హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌హాల్‌లో శుక్రవారం మహిళలు మానసిక అనారోగ్యం అంశంపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పద్మాకమలాకర్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యంపై చైతన్యం పెంచడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10న జరుపుకునే ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ప్రధాన థీమ్ పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యం అన్నారు. కోవిడ్-19 అనంతరం ఉద్యోగాలలో ఒత్తిడి, ఆందోళన ఎక్కువగా పెరిగాయని తెలిపారు. మానసిక ఆరోగ్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన భాగమని హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీవరకు విద్యార్థులకు, కార్యాలయాలు, విలేకరులకు, ఉద్యోగులకు పలు స్లమ్ ఏరియాల్లో, హోమ్స్, వృద్ధాశ్రమాల్లో అవగాహన కల్పించేందుకు మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథులుగా మానసిక వైద్యులు డా. రవ్వ హరికుమార్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్‌గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, యోగా గురు సరోజినీరామారావు, గోపాలకృష్ణ,సైకాలజిస్టులు కృష్ణవేణి, స్వరూపరాణి, శోభారాణి, జ్యోతిరాజా పాల్గొంటారన్నారు. వివరాలకు 9390044031 నెంబర్‌లో సంప్రదించాలని పద్మాకమలాకర్ సూచించారు.

సభ్యత్వ టార్గెట్‌ను పూర్తి చేయాలి

● బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రామ్


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రామ్, పక్కన కార్పొరేటర్ రవిచారి తదితరులు

రాంనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్‌లో పార్టీ అధిష్టానం ఇచ్చిన ప్రకారం సభ్యత్వ టార్గెట్‌ను పూర్తి చేయాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రామ్ సూచించారు. శుక్రవారం సాయంత్రం డివిజన్ బీజేపీ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్ అధ్యక్షతన చిక్కడపల్లి కమ్యూనిటీహాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రమేష్‌రామ్, స్థానిక కార్పొరేటర్ కె. రవిచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూ, ప్రతి బూత్‌లో 300 సభ్యత్వం చేయాలని, ప్రతీ క్రియాశీలక కార్యకర్త 100 మంది సభ్యులను చేయించాలని సూచించారు. డివిజన్ మొత్తంలో కనీసం 5 వేల సభ్యత్వం జరిగేలా చూడా లన్నారు. కార్పొరేటర్ కె. రవిచారి మాట్లాడుతూ ఈ నెల 18 వరకు సభ్యత్వ గడువు ఉందని, ప్రతి ఒక్కరూ కనీసం 50 సభ్యత్వం చేయించాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, నాయకులు గడ్డం నవీన్, రఘునాథ్, ఉపేందర్, శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మామిడి హరికృష్ణ

ప్రాపంచిక దృక్పథంతో రచనలు రావాలి

రాంనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రాపంచిక దృక్పథంతో రచనలు రావాల్సిన అవసరం ఉందని తెలంగా ణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నా రు. శుక్రవారం సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ, డీవైఎఫ్ఐల సంయుక్త ఆధ్వర్యంలో యూత్ లిటరరీ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నవల పుట్టుక, కథ పుట్టుక పరిణామ క్రమాన్ని చాలా చర్చించాం కానీ, తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యంలో బాగా రాస్తున్న యువత రచనలపై ఇలాంటి వేదికపై చర్చకు అవకాశం కల్పించడం ముదావహమన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి మాట్లాడుతూ, యువత రచనలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కొత్త రచనలకు బాటలు వేయడమే ఈ ప్రధాన ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటి రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, నగర కార్యదర్శి ఎం.డి.జావీద్, హష్మీబాబు, ప్రముఖ రచయిత్రి నస్రీన్ ఖాన్, తంగిరాల చక్రవర్తి, సలీమ, రేఖ, శరత్ సుదర్శి, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం, సత్కారం ప్రోత్సాహాన్నిస్తాయి

చిక్కడపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కళాకారులకు పురస్కారం, సత్కారం పోత్సాహాన్నిస్తాయని సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, రిటైర్డ్ బ్యాంక్ అధికారి రామ్‌చందర్‌రావు అన్నారు కళానిలయం ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయ గానసభలో నవరాత్రి నాట్యవైభవం పేరిట బతుకమ్మ సంబరాలు-దసరా పురస్కారాలు పేరిట నృత్యప్రదర్శనలు, టీవీ చానల్స్, సినీ నటీమణులకు పురస్కార ప్రదానోత్సవం కనులపండువగా జరిగింది. ముఖ్యఅతిథులుగా దైవజ్ఞశర్మ, రామ్‌చందర్‌రావు పాల్గొని నటీమణులు బెజవాడ బేబక్క, ఈస్తర్ నూరూన్నా, రవితేజ, అమర్‌దీప్‌లకు పురస్కారాలు అందజేశారు. నాట్యగురువులను సత్కరించారు. నిర్వాహకులు సురేందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


చిక్కడపల్లిలో నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ మండపంలో అమ్మవారికి పూజలు చేసిన మాజీ కార్పొరేటర్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు


అంబర్‌పేటలోని మహంకాళి ఆలయంలో జరిగిన లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె. పద్మావతి డీపీ రెడ్డి తదితరులు


బతుకమ్మకుంటలోని మైసమ్మ ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారు


గోల్నాక జైస్వాల్ గార్డెన్ కాలనీలోని మైసమ్మ గుడిలో మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు


గాంధీనగర్ డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్‌లో గజానంద్ భక్తి సమాజ్ ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో పూజలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగం రవి, బీజేపీ నేత గాదె శ్రీనివాస్, వీహెచ్‌పీ నేత పగడాకుల బాలస్వామి


జెమినీ కాలనీలోని పోచమ్మ ఆలయంలో రోహిత్ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్, ప్రకాష్, బాల, సత్యనారాయణ, అరుణ్, వెంకటేష్, అమిత్, రాజేష్

గాయత్రీదేవీ కటాక్షించు

అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. నవరాత్రుల్లో రెండవ రోజైన శుక్రవారం ఆలయాలు, మండపాల్లో కొలువైన దుర్గామాతను గాయత్రీదేవిగా, మహాలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గాయత్రీదేవీ మమ్మల్ని కటాక్షించు, కంటికి రెప్పలా కాపాడు అంటూ భక్తులు ప్రార్థించారు. పలుచోట్ల ఉత్సవ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.
- అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ల బృందం


ముషీరాబాద్ రంగానగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతను కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్న భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు

మహాకాళిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

నల్లకుంట: అంబర్‌పేట మహంకాళి ఆలయంలోని అమ్మవారిని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాకప్పి సత్కరించారు. కార్యక్రమంలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, ప్రతినిధులు రంగంపల్లి రాజు, మోర శ్రీరాములు ముదిరాజ్, గడ్డం శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దోమలగూడలో వినాయక యూత్ అసోసియేషన్ మండపంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ నియోజకవర్గ ఎస్సీ మోర్చా కన్వీనర్ పి. పరశురాం, నిర్వాహకులు నర్సింగ్‌గౌడ్, నరేష్


ముషీరాబాద్ మహాకాళి ఆలయంలోని గాయత్రీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మీ హరిబాబు యాదవ్, ఆలయ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రమౌళి, బీఆర్‌ఎస్ నాయకులు

నూతన ధర్మకర్తల మండలి నియామకం


నూతన ధర్మకర్తల మండలి సభ్యులు

నల్లకుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి (న్యూరామాలయం) ఆలయం నూతన ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఇటీవల రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆలయంలో నిర్వహిస్తున్న జ్ఞానసరస్వతి దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నూతన ధర్మకర్తల మండలి సభ్యుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి నూతన చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు మాట్లాడుతూ, భక్తుల సహకారంతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.సమావేశంలో ఆలయయ ధర్మకర్తల నూతన కమిటీ సభ్యులు ఎన్.వెంకటేశ్వరరావు, ఎ.మధుకుమార్, వై.మురళీ, మధుసూదన్, ఎ.మురళీకృష్ణ, కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ డిమాండ్

నల్లకుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదర్‌గూడలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ కన్వీనర్లు మన్నె శ్రీధర్‌రావు. పి. బల్వంత్‌రావు, కో-కన్వీనర్లు తాలుకా రాజేష్, అంజలి విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రతియేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను నమ్మించి 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులతో చెలగాటమాడుతుందని వారు ఆరోపించారు. తెలంగాణలో ప్రజాపాలనలో నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పరిశ్రమలలో రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రజా పాలనలో ప్రజా సంక్షేమ పథకాలు, నిరుద్యోగుల సమస్య పరిష్కారానికి పెద్దపీట వేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో తొమ్మిది మందికి జైలు

బర్కత్‌పుర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన తొమ్మిది మందికి కోర్టు జైలు శిక్ష విధించిందని ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు మొదటి సారి మద్యం తాగి పట్టుబడగా, వారి కి కోర్టు ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్ష, ఆరుగురు రెండోసారి మద్యం తాగి పట్టుబడటంతో ఒక్కొక్కరికి నాలుగురోజుల జైలు శిక్ష నాంపల్లి ఏడవ జేఎఫ్ఎంసీ కోర్టు విధించిందని సీఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం: జైసింహ


గోవింద్‌ను పరామర్శిస్తున్న ముఠా జైసింహ తదితరులు

ముషీరాబాద్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు టీఆర్ గోవింద్ తీవ్ర అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండడంతో విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహా శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. గోవింద్ ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆర్థికంగా అన్ని విధాలా అదుకుంటామని కోరారు. ముషీరాబాద్, గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రాకేష్‌కుమార్, పార్టీ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు


బర్కత్‌పురలోని రెడ్డి కాలేజీలో బతుకమ్మ సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థినులు

రేపు 'ఆమ్ ఆద్మీ' ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

కవాడిగూడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలను ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహిస్తామని ఆప్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్ యమునగౌడ్ వెల్లడించారు. శుక్రవారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆదివారం సాయంత్రం 4 గంటలకు నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బతుకమ్మ వేడుకల్లో అన్ని వర్గాల మహిళలు పాల్గొని ఆట, పాటలతో ఏకత్వస్ఫూర్తిని చాటుతారన్నారు. సమావేశంలో ఆప్ డాక్టర్స్ వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మా, నాయకులు ఉన్నిసా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖకు క్షమాపణ చెప్పి వివాదానికి స్వస్తి పలకాలి

చిక్కడపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొండా సురేఖకు మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పి వివాదానికి ముగింపు పలకాలని తెలంగాణ బీసీ ఉద్యోగులు సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కురుమ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మంత్రి కొండా సురేఖ తనపై సోషల్ మీడియాలో వస్తున్న ట్రోలింగ్‌ను చూసి అసహనంతో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నప్పటికీ కొంతమంది సెలబ్రిటీలు మానసిక దాడులకు పాల్పడితే సహించే ప్రశ్నేలేదని హెచ్చరించారు. కొండా సురేఖపై జరుగుతున్న ముప్పేట దాడిని ఎదుర్కొని రక్షణ కవచంగా నిలిచి ఆమెకు నైతిక ధైర్యం కల్పించాలని ఆయన బీసీ శ్రేణులకు, బడుగులకు విజ్ఞప్తి చేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నల్లకుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటిజెన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బీపీ, షుగర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కె.వీరయ్య తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం పక్కన హైదరాబాద్ జిందాబాద్ సంస్థ కార్యాలయంలో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. వివరాలకు ఫోన్ నం. 9949821177లో సంప్రదించాలన్నారు.

తెలుగు వర్సిటీకి సురవరం పేరు పెట్టడం హర్షణీయం

చిక్కడపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు యూనివర్సిటీకి స్వాతంత్ర్యయోధుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నేతలు ప్రఫుల్ రాంరెడ్డి, ఎల్లూరి భాస్కర్‌రెడ్డి హర్షం ప్రకటించారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి జనని ఫౌండేషన్ కృషి అభినందనీయం


మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, జనని ఫౌండేషన్ మల్లేష్ బాబు

కవాడిగూడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి జనని ఫౌండేషన్, భారత్ కేర్ చేస్తున్న కృషి అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. జనని ఫౌండేషన్, భారత్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్ బండమైసమ్మ నగర్ కమ్యూనిటీహాల్‌లో వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణ పొందిన సుమారు వంద మంది మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జనని పౌండేషన్, భారత్ కేర్ సిబ్బంది మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా ఎదిగేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జనని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాచకొండ మల్లేష్ మాట్లాడుతూ, మహిళల సమగ్రాభివృద్ధి కోసం తమ ఫౌండేషన్ అనేక సంవత్సరాలు కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రనమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠాజైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, జనని ఫౌండేషన్ సభ్యులు సి శంకర్, ముత్యం, నమిత, భారత్ కేర్ నుంచి సందీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

టెలికం ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

చిక్కడపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): టెలికం శాఖలో ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలంగాణరాష్ట్ర టెలికం శాఖ కంట్రోలర్ అనితా మహదాస్ అన్నారు. చిక్కడపల్లిలోని టెలికం సర్కిల్ శాఖ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్(ఎన్‌సీ ఎస్టీ) గౌరవ సభ్యులు జటోతు హుస్సేన్ సందర్శించి టెలికం డిపార్ట్‌మెంట్‌లో షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంప్లాయీస్ కోసం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు సేకరించారు. ఈసందర్భంగా జటోతు హుస్సేన్ టెలికం తెలంగాణ సర్కిల్ కంట్రోలర్ అనితా మహదాస్, జాయింట్ కంట్రోలర్ సీఎం సంపార్, డిప్యూటీ కం ట్రోలర్ ప్రతిమ కందేలతో సమావేశమయ్యారు. అనంతరం జటోతు హుస్సేన్‌ను అనితా మహదాస్ సన్మానించారు. కార్యక్రమంలో టెలికం ఎస్టీ ఎంప్లాయీస్ మను రామవత్, టిక్యోజ్, ఎన్‌సీఎస్టీ ప్రతినిధులు కిరణ్‌కుమార్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

అంబర్‌పేట సమగ్రాభివృద్ధియే లక్ష్యం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం సమగ్రాభివృద్ధే లక్ష్యంగా, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చెప్పారు. శుక్రవారం గోల్నాక డివిజన్ తిరుమలనగర్ సీపీఎల్ రోడ్ ఏకే ఫంక్షన్ ప్లాజా లేన్‌లో రూ.7 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ పైప్ లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో నెలకొన్న అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి దిశలో ముందుకు సాగుతు న్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ రోహిత్, జీహెచ్ ఎంసీ వర్క్ఇన్‌స్పెక్టర్ మనోహర్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బోదాసు శేఖర్, రుద్రయ్య, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

హెల్త్ సర్వేకు విశేష స్పందన: డీఎంసీ


ఖాద్రీబాగ్‌లో హెల్త్ సర్వేలో పాల్గొన్న డీఎంసీ మారుతి దివాకర్ తదితరులు

రాంనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అంబర్‌పేట, ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డిజిటల్ హెల్త్ సర్వే కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అంబర్‌పేట సర్కిల్ గోల్నాక డివిజన్‌లోని ఖాద్రీబాగ్‌లో డీఎంసీ మారుతి దివాకర్ ఆధ్వర్యంలో జరిగిన సర్వే మూడు టీమ్‌లు పాల్గొని ఇంటింటి సర్వే నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 205 ఇళ్లల్లో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి రోజు నిర్వహించిన సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు సర్వే కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో..


చిక్కడపల్లిలో సర్వేలో పాల్గొన్న తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, ఏఎంసీ రవిచంద్ర

ముషీరాబాద్ సర్కిల్ పరిధి లోని రాంనగర్ డివిజన్ చిక్కడపల్లి శ్రీనివాసపురంలో డీఎంసీ మహ్మద్ ఖాదర్ మోహినుద్దీన్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే జరిగింది. తొలి రోజు 139 ఇళ్లల్లో హెల్త్ సర్వే చేశామని డీఎంసీ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద చిక్కడపల్లిలో ఈ నెల 9వ తేదీ వరకు సర్వే జరుగు తుందన్నారు. సర్వేలో ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్, ఏఎంసీ రవిచంద్ర, డీపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

● ఎ.మహేందర్ పటేల్


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్ పటేల్

రాంనగర్, అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర జనాభాలో మెజారిటీ సంఖ్య గల మున్నూరు కాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం వెయ్యి కోట్లతో మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.మహేందర్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్నూరు కాపుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరు కాపులంతా ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే మున్నూరుకాపు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయంపై మున్నూరుకాపులు ఆధారపడి జీవిస్తున్నారని వారికి కావాల్సిన వ్యవసాయ పనిముట్లను 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.